
# చెప్పు-డప్పు

కాలువ మల్లయ్య



బజార్లో నడుస్తున్నాను. నా కళ్లముందు పని సంస్కృతి కదులుతున్నది. శ్రీశ్రీ కదులుతు న్నాడు. నా నాలుకమీద అతని కవిత్వ పంక్తులు కదలాడుతున్నాయి.

ఒక కాలి చెప్పు ఉంగటం తెగింది. మరో కాలిచెప్పు ఉంగటం తెగేట్టుంది. ఉంగటం లేని కాలి చెప్పుతో కష్టంగా నడుస్తున్నాను. రెండో ఉంగటం తెగ కుండా జాగ్రత్త పడుతున్నాను. మెల్లమెల్లగా నడుస్తున్నాను . చెప్పులు కుట్టేవాడి దుకాణం వైపు నడుస్తున్నాను. ఉంగటం తెగిన చెప్పు ఇబ్బంది పెడుతున్నది. 'చెప్పుకు దండం బెడతా... అరె బై డప్పుకు దండం బెడతా, చెప్పులు కుట్టేవాడి చేతికి దండం పెడతా... డప్పును ధణధణ మోగించే కర్రకు దండం బెడతా... దండా బెడతా...పనికీ దండం బెడతా... సృష్టికర్తకు దండం బెడతా' అప్రయత్నంగా నా నాలుకమీద ఈ చరణాలు కదిలాయి. అప్రయత్నంగానా? కాదు కాదు. ఎంతోకా లంగా ఆ భావజాలం నాలో కదిలితే తప్ప హృదయ మథనం జరిగితే తప్ప నాలుకమీద ఆ వాక్యాలు కదల డం సాధ్యమా?

"ఏంటి మహేశ్? రోడ్డుపై నడుస్తూ ఆలోచిస్తు న్నావు. అసలు నువ్వే ఓ ఆలోచనల పుట్ట. నిరంతరం ఆలోచిస్తే బి.పి. పెరుగుతుంది. బి.పి. బాగా పెరిగితే తొందరగానే ఫట్" మీద చెయ్యేస్తూ అన్నాడు మిత్రరత్నం... పేరు కూడా రత్నమే!

ఇప్పుడు తనకు బ్లడ్‌ప్రెషర్ లేదనుకుం టున్నాడు రత్నం. పూర్‌ఫెలో! బిపి ఉంటే ఫట్ అట! పోతే పోతాడు. తనలాంటి వాడికి బిపి లేకుండా ఉండటం సాధ్యమా? కొద్దికొద్దిగా అదుపులో ఉంచుకుంటున్నాడు. పోనియ్! పోతే పోనీయ్. ప్రాణాల్...గీనాల్... పందయి పదేళ్లు బతికేకంటె నందయి నాలుగేళ్లు బతికినా చాలు... నో...నో...పందిని హీనంగా చూడకు, పందికీ ప్రయోజన ముంది. ఆ పందులే లేకుంటే నేలంతా మురుగుదొడ్డయ్యేందేది. హీనంగా చూడకు దేన్నీ. దేని ప్రయోజనం దానిదే....

"ఏంటీ! నేను మాట్లాడుతుంటే నువ్వేమో ఆలోచన ల్లోకి వెళ్లిపోయావు. నడుస్తూ కూడా ఆలోచించాలా మహేశ్?"

"రత్నం! నీకు బిపి లేదా?"

"లేదు...లేదు... నాకు బిపి లేదు."

"నీ వయసెంత?"

"నలభై ఐదు."

"అయితే నువ్వు బతకడం లేదన్నమాట."

నవ్వాడు రత్నం. నన్నో పిచ్చివాణ్ణి చూసినట్టు చూశాడు.

"బిపి లేకుంటే బతకడం లేదన్నట్టా? అదేంటి?"

"నేనో డాక్టర్ దగ్గరికి వెళ్లాను. బిపి చెక్ చెయ్యమని. అతడేమన్నాడో తెలుసా? చెక్ చేయాల్సిన పనిలేదు. నీకు తప్పకుండా బిపి ఉంటుంది. మీకు బిపి లేకుంటే ఆశ్చర్యపడాలి తప్ప ఉన్నందుకు కాదన్నాడతను.

అతడన్నట్టే అయింది. నిరంతరం ఆలోచన, సామాజిక చింతనలాంటివి ఉన్నవాళ్లకు బిపి తప్పకుండా ఉంటుందన్నాడు. ఆ డాక్టరే ఓ తత్త్వవేత్త అన్నమా టల్ని చెప్పాడు. నలభై, నలభైఐదు దాటినత ర్వాత కనీసం బిపి కూడా లేకుండా ఆ మనిషి బతకడం లేదన్న మాటే. ఇందులో అతిశయోక్తి కన బడినా ఈ మాటలు చాలావరకు నిజం. ఓ దిక్కు సమాజం వివిధ రుగ్మతలతో కాలిపోతుంటే, మాడిపోతుంటే, దహించు కుపోతుంటే ఆలోచనాపరులకు బిపి రాకుండా ఎలా ఉంటుంది? ఏ ఆలోచనా లేకుండా చిన్ని నా పొట్టకు శ్రీరామరక్షనుకుంటూ బతికే బతుకూ బతుకేనా?"

"అలాగా... అయితే బాగా ఆలోచించి బిపిని పెంచుకో. దాన్ని భద్రంగా కాపాడుకో."

"నువ్వు వందేండ్లు బతికి ఏం చేస్తావో చెయ్యి. కాకి చిరకాలమున్ననే కార్యమగును. కోకిల తన మధుర కంఠంతో సమాజానికానందమిస్తూ కొద్ది కాలమున్నా చాలుగదా. నా కయితే నా పిల్లలు జీవితంలో స్థిరప డేంతవరకు బతికితే చాలనుకుంటా."

"అబ్బా... నోరు తెరిస్తే చాలు. ఆదర్శాలు, దేశం, సమాజం... సరేగాని ఏటో పోతున్నావేంటి? అదీ ఉంగ టం తెగిన చెప్పుతో కుంటుకుంటూ..."

"చెప్పుకు దండం బెడతా... చెప్పులు కుట్టేవాడి దగ్గ రికి..."

"నువ్వు చెప్పుకు దండం పెట్టాల్సిన అవసరం లేదు. ఓ రూపాయిస్తే ఉంగటం కుట్టిస్తాడు. వట్టిదండం బెడితే ఊర్కోడు."

"చెప్పంటే శ్రమజీవనానికి ప్రతీక. రాళ్లు, రప్పలు, ముల్లనుండి కాళ్లను రక్షిస్తుంది. అలాంటి చెప్పుకు దండం బెడితే తప్పేంటి?"

"అయితే విడిచి నెత్తిమీద పెట్టుకో."

"పెట్టుకుంటే మాత్రం తప్పేముంది? మన మెన్నిసార్లు చెప్పును తలమీద పెట్టుకోవ డం లేదు? వాటితో కొట్టుకోవడం లేదు? చెప్పులు తయారు చేసేది జాంబవంతుల వంశీయులు. మనదేశంలోని ఆదివాసులు వారే. ఈ దేశంలోని ఆదిమ భారతీయులు... దళితులు... గిరిజనులే... అయినా వాళ్ల స్థితి అధ్వాన్నంగానే ఉంది."

"అమ్మబాబోయ్! నీ మాటలు, చేతలు ఏమీ నాకర్థం కావు. చెత్తకుండీల్లో పాత చెప్పులేరుకునే వానిమీద చెయ్యేసి మాట్లా డతావు. బాగా చదువుకున్న వాడిపై ఉండి కూలినాలి చేసుకునే మురికి మనుషులను పక్కన కూర్చొబెట్టుకుంటావు. ఇప్పుడు ఏకంగా చెప్పుకే దండం బెడతా నంటున్నావు. చెప్పుకు, డప్పుకు దేనికైనా దండం బెట్టుకో... అది నీ ఇష్టం. నేనుమాత్రం ఆ పనులు చేయలేను. నీ ఇష్టం మహాప్రభో..." అంటూ గబగబా వెళ్లిపోయాడు రత్నం.

పో...పో... పోతే పోనియ్. హితుల్... సుతుల్... వస్తే రానియ్... కష్టాల్... నష్టాల్... నా అభిప్రాయాలు మాత్రం మారవు అనుకుంటూ ఉంగటం తెగిన చెప్పు కాలితోనే నడుస్తున్నాను. 'దళితులంటే మాలావు ప్రేమ ఈయనకు... అదేదో గొప్ప పననుకుంటు న్నాడు' మాటలు... ఏవేవో మాటలు...

ఎదురుగా చేతిలో కట్టెతో మురికి కాలువలు శుభ్రం చేసేవాడు. దొడ్డు బ్రష్‌తో మరుగుదొడ్లు కడిగేవాడు. నగ్నంగా భయోద్విగ్నంగా... కాదు...కాదు... హీనంగా.. దీనంగా... హీనంగా చూడకు దేన్నీ. అర్ధన గ్నంగా... ఆకలి కడుపులతో...

సమాజాన్ని 'శుభ్రం' చేసేవాడు సమాజానికెంతో ఇచ్చేవాడు. అంటరానివాడుగా... దూరంగా... దూరంగా ఉండటం ఏ సంస్కృతికి ఫలశృతి? చెత్త నూడ్చేవాడు... చనిపోయిన పశువులను కోసి పారేసే వాడు... ఎన్ని పనులు చేస్తున్నాడు? అతడు తన పనులు చేయకుంటే దేశమంతా మురికి మురికిగా... జంతుకళేబరాలతో.... శవాలతో... వాసనతో... రోగా

లతో... రొష్టులతో... తాను రోగగ్రస్థుడవుతూ సమాజానికారోగ్యాన్ని పంచుతున్నాడు.

ఆదివాసీ! నీకు సలామ్. నీ సంతతికి సలామ్. సలామ్.. సలామ్.. ఆదిమ భారతీయుడా సలామ్. మీ వాళ్లందరికీ సలామ్!

సకల వ్యవసాయ పనిముట్లకు తోలు వస్తువుల నందించేవాడా... జనమందరికీ ఉపయోగపడే పాదరక్షల నందించేవాడా! అద్భుతమైన కళానైపుణ్యంతో తాళ్లు తలుగులు పేనే నేర్పరీ! అసహ్యమనుకోకుండా మలానెత్తిపోసే వైద్యుడా! ఓ మనిషీ వెట్టిచేసేవాడా! వ్యవసాయం చేసేవాడా! పంచముడని నిన్ను సమాజానికి దూరముంచినా దుర్మార్గాన్నిఎలా సహించావు? ఎందుకు సహించావు? నీ పనెందుకు హీనమైందో... నువ్వెందుకు ఛండాలుడివో ఒక్కసారి ప్రశ్నించు... ప్రశ్నించు... నిన్నీ స్థితికి నెట్టిన వాళ్లను నిలదీసి ప్రశ్నించు.

"ఏంటీ? ఏదో మూడీగా ఉన్నట్టున్నావు? ఎటో పోతున్నావు?" ఎదురుగా వస్తున్నతను ప్రశ్నించాడు.

నీ కెందుకోయ్ నా గురించి? ప్రశ్నార్థకంగా చూశాను. వెళ్లిపోయాడతను.

ఈ జీవనతరంగాలలో ఎవరికి ఎవరూ సొంతమూ... ఎంతవరకీ బంధమూ! ఏమో తెలియదు.

అరే... పాటకాడ మనమే... మేడకాడ మనమే... పాడె గట్టాలంటే దళితుడే కావాలి. పాడె ముందు డప్పు గొట్టాలంటే హరిజనుడే కావాలి. బొంద తవ్వడానికి, శవం పూడ్చడానికి, శవం కాల్చడానికి నువ్వే... నువ్వే కావాలి.

హరిశ్చంద్రుడి దగ్గరే కాటిసుంకం వసూలు చేసిన వీరబాహుా! నువ్వు లేందెక్కడ? అంతటా నువ్వే! నువ్వు లేందీ సమాజం ముందుకు పోగలదా? నీగ్రోగా... చమార్‌గా... హరిజనుడిగా... వెట్టివాడిగా... బానిసగా... నల్లవాడిగా... పీడితుడిగా... శవవాహకుడిగా... పాలేరుగా... సర్వసంపదలను సృష్టించేవాడిగా... నువ్వే... నువ్వే ... అంతటా నువ్వే!

కాని అన్నిటికీ దూరంగా... దూరదూరంగా... ఎన్ని రకాల దుర్మార్గాలు నీమీద.

విశ్వరూపంలో నువ్వు... కాని విశ్వానికే దూరంగా... డొడ్డొంకడొం... డొడ్డొంకడొం... డప్పు మోత. ఊరు చాటింపు చేసే డప్పుమోత. ఊళ్లోకెవరొచ్చినా ఏ విషయం తెలియజేయాలన్నా చాటింపు చేయాల్సిందే. డప్పు చాటింపు చేస్తూ నువ్వు తిరగాల్సిందే. నోరు నొప్పి పెడుతున్నా విన్లేదెవరో వినవో లేదెవరో అని ఒర్లాల్సిందే.


పెండ్లి డప్పు... ఎవరింట్లో పెండ్లయినా డప్పుమోత తప్పదు... అన్ని శుభకార్యాలకు డప్పు... శోభనానికీ డప్పే...

పోచమ్మకు చేసుకుంటే డప్పు... డొడ్డొంకడొం... బోనాల ఊరేగింపుకు డొడ్డంకడొం... డప్పు చప్పుడుతో ఎగురుతూ... తులూతూ... దండోరా... డప్పుతో దండోరా...

చావుడప్పు... విషాద నాదాన్ని మోగిస్తూ డప్పు... శవం ముందు డప్పు. పుట్టిన్నుంచి చావువరకూ అంతటా డప్పు నాదమే... డప్పుకాడ మనమే... ప్రతి పనికాడా మనమే...

ప్రతిచోటా డప్పుఅవసరమే. ఆ డప్పే ఎందరికో ఉత్తేజాన్నిచ్చింది... గద్దర్ గళమైంది.

డప్పుకాడ నువ్వే... మరి చెప్పుకాడ నువ్వే...



అందుకే డప్పుకు దండం బెడతా...

డప్పు చప్పుడుకు దండం బెడతా...

"భలేగున్నావ్... ఎటు చూసుకుంటూ నడుస్తున్నావు? ఏమిటాలోచిస్తున్నావు?" అన్నాడొకతను తగులుకుంటూ పోతూ...

"నేను సరిగ్గానే నడుస్తున్నాను. ఎడమ చేయి దిక్కు. నువ్వే తప్పుడు మార్గంలో నడుస్తున్నావు. నాది పనిని ప్రేమించే దారి. నీది విశ్రాంతి వర్గాల దారి..." అనాలనుకున్నాను పోనీలే, బేవార్స్‌గాడని ఊరుకున్నాను. మెల్లమెల్లగా నడుస్తూ చేరుకున్నాను. వేపచెట్టు నానుకుని టేలా... చెట్టుకింద చెప్పులు రిపేరు చేసే దుకాణం.

ఓ తట్టుసంచీ మీద కూర్చున్నాడు లింగయ్య. చెప్పులను మరమ్మతులు, తయారుచేసే మెకానిక్.

అతని ముందు నల్లసరంబండ... రంపం, గూటు, ఆరె, స్క్రూడ్రైవర్, అంబూర్, దారం, మెలలు, పక్కన బెస్టిక్ అడ్‌హెసివ్ డబ్బా. రకరకాల పనిముట్లు, తోలు, రబ్బరుషీట్. రకరకాల ఆకారాల్లో కత్తిరించిన తోలుముక్కలు. టేలానిండా పాతబూట్లు, చెప్పులు. చిరిగిన సంచులు, పక్కనే చిన్నమిషన్. రిపేర్లకు, కుట్టడానికుపయోగపడే మిషన్.

కత్తితో తోలును కోస్తున్నాడు లింగయ్య. తెగిన చెప్పులను దారంతో కుడుతున్నాడు, గూటంతో గుద్దుతున్నాడు.

అతనికి చెయ్యి చాపితే అందేంత దూరంలోనే గ్రైండరుంది. లింగయ్య దగ్గర పనిచేసే పిల్లవాడు చెప్పులకు మొలలు కొడుతున్నాడు. లింగయ్య చేతులు గబగబా పనిచేస్తున్నాయి. అతని కండ్లు నిశితంగా చూస్తున్నాయి. అతని ముఖంలో మెరుపుదనముంది. అతని కండ్లు, నోరు, చేతులు తమ పనిని కానిస్తున్నాయి. పనితనం... ఎంతో గొప్ప పనితనం... మంత్రముగ్ధుల్ని చేసే పనితనం... అతని పనిలో ఎంతో కళాత్మకత!

మట్టికాడ మనమే- ఆ మెట్టికాడ మనమే

కోతకాడ మనమే —మరి మోతకాడ మనమే

దొడ్డికాడ మనమే —గడ్డాముకాడ మనమే

అరుకబట్టె మనమూ— ఆ సెలుకదున్నే మనమూ

ఇంత పనిమంతులు... ఇన్నిరకాల పనులు జేసే పనిమంతులు... సర్వసంపదలను సృష్టించే సృష్టికర్తలు... అంటరానివాళ్లుగా... అస్పృశ్యులుగా... పంచములుగా...

పండించిన పంటకు ముట్టుడులేదు... పండించే వాడంటే ముట్టుడు...

ఉంగటం తెగిన చోట వేలును నొక్కిపట్టి నడవడం వల్ల కాలు నొప్పెడుతోంది.

టేలాముందు కూర్చున్న లింగయ్య ముందుకెళ్లి నిల్చున్నాను. ఒకాయన దర్పంగా, నిర్లక్ష్యంగా చెప్పు విడిచి లింగయ్య ముందుకు తోసాడు. పొగరుగా నిల్చున్నాడు.

ఎంతో ఓర్పు లింగయ్యకు. అతని పని పూర్తిచేసాడు. చెప్పులు విడిచి అతని ముందుకు జరిపాను.

"ఉంగటం తెగింది... కుట్టివ్వు..."

"తోలువేసి కుట్టమంటారా... మొలకొట్టమంటారా?"

"ఎలా మంచిగుంటే అలా చేయి..."

"మంచిగుండటం కాదుసార్... వట్టిగ మొలకొడితే ఒక్క ఉంగటానికి యాభైపైసలు... దారంతో కుడితే రూపాయి..."

'అంతేనా లింగయ్యా! నీ ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు ఎవరు? ఒక్క రూపాయికే ఇంత పనిచేస్తావా? రెండ్రూపాయలైనా ఫర్వాలేదు... చెయ్యి... చెయ్యి...'

పైకనాలనుకున్నా అనలేకపోయాను. "తోలేసి కుట్టేసేయ్..."

నా చెప్పును కుడుతున్నాడు లింగయ్య. దొడ్డుసూదికి దారంబెట్టి ఉంగటానికి మరింత తోలు అతికేసి కుడుతున్నాడు. తోలును లోపలికి తోసి కుట్టేశాడు. గూటంతో దబదబా గుద్దుతున్నాడు.

"రెండవ ఉంగటం కూడా తెగేటట్టుంది... కుట్టమంటారా సార్?"

కుట్టు... కుట్టు... అదీ తెగితే ఎంత నరకం? తలూపాను.

అతడు పనిచేస్తున్నాడు.

ఆ పని చూస్తుంటే ఆ చేతికి దండం బెట్టాలనిపిస్తుంది. ఎంతో పని నేర్పరితనమున్న చేతులు.. కాని అతని డొక్కలు మాత్రం లోపలకు పోయాయి. అతని శరీరం ఎముకలు దేలింది. మరాతని కష్టార్జితమేమవుతున్నది?

పని పూర్తి చేశాడు లింగయ్య.

"ఎంతివ్వాలి?"

"రెండు రూపాయలు సార్!"

డబ్బిచ్చేశాను.

ఉంగటాలు కుట్టిన చెప్పులు తొడుక్కున్నాను. హాయిగా... దర్జాగా నడుస్తున్నాను. కేవలం రెండు రూపాయలతో ఎంత సుఖం?

ఎంత సౌకర్యం?

అంత గొప్ప పనివాడి శ్రమ ఖరీదు రెండు రూపాయలేనా? అదీ ఇవ్వడానికెందుకేడుస్తారు జనాలు?

ముందుకు నడుస్తున్నాను నేను.

★

**హరిశ్చంద్రుడి దగ్గరే కాటిసుంకం వసూలు చేసిన వీరబాహుా! నువ్వు లేందెక్కడ? అంతటా నువ్వే! నువ్వు లేందీ సమాజం ముందుకు పోగలదా? నీగ్రోగా... చమార్‌గా... హరిజనుడిగా... వెట్టివాడిగా... బానిసగా... నల్లవాడిగా... పీడితుడిగా... శవవాహకుడిగా... పాలేరుగా... సర్వసంపదలను సృష్టించేవాడిగా... నువ్వే... నువ్వే ... అంతటా నువ్వే!**